ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.31 | సహర్: 5.04 (బుధవారం)



యాదాద్రి భువనగిరి

3

మంగళవారం 12 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.134	194	221
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.0 । కనిష్ఠం 24.0

బ్రహ్మోత్సవ సంబురం



భక్తుల ఇలవేల్పు దైవం యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వస్తిపుణ్యాహావాచన పూజలతో వేదపండితులు సోమవారం వైభవంగా శ్రీకారం చుట్టారు. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి సోమవారం నుంచి శుద్ధ ద్వాదశి ఈనెల 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. కాగా, సోమవారం ఉదయం 10గంటలకు అర్చకబృందం, రుత్వికులు వేదోక్త పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ విశ్వక్సేనారాధన, స్వస్తిపుణ్యాహావాచన పూజలతో దేవదేవుడి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు తెరతీశారు. విశ్వశాంతి, లోకకల్యాణార్థం నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలను పాంచరాత్రాగమ శాస్త్రానుసారం ప్రధానాలయంలో నిర్వహించనున్నారు.

– (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- వైభవంగా లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- శాస్త్రోక్తంగా స్వస్తిపుణ్యాహావాచనం, విశ్వక్సేనారాధన
- రాత్రి మృత్సంగ్రహణం, అంకురారోపణ పర్వాలు
- పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

సీఎం పర్యటన ఇలా..

నృసింహుడి బ్రహ్మోత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబసమేతంగా వచ్చారు. ఆయనతోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో సోమవారం ఉదయం 10గంటలకు గుట్టకు చేరుకున్నారు. సీఎంకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంత్ కే. జెండగే, భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్‌చంద్ర స్వాగతం పలికారు. కొండ కింద ఉత్తర దిశగా ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి ప్రెసిడెన్సియల్ సూట్‌కు కాన్వాయ్‌లో చేరుకున్నారు. కొండపైకి 10.33గంటలకు ప్రత్యేక కాన్వాయ్ ద్వారా వచ్చారు. 10.42గంటలకు ఉత్తర ద్వారం ద్వారా ప్రధానాలయంలోకి ప్రవేశించారు. ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి గర్భాలయంలో సీఎంతో పాటు ఆయన భార్య గీతారెడ్డి, మంత్రులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రధానాలయంలో అర్చకులు, వేదపండితులు సీఎంకు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మాడవీధుల్లోని అద్దాల మండపంలో సీఎంకు స్వామివారి చిత్రపటం జ్ఞాపికను అందజేశారు. 11.45గంటలకు యాదగిరిగుట్ట నుంచి సీఎం హెలీకాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

నేటి ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, వేదపారాయణాలు, సాయంత్రం 6.30 గంటలకు భేరీపూజ, దేవతాహ్వానం

విశ్వక్సేనుడికి తొలిపూజ

దేవతల సర్వసేనానాయకుడు విశ్వక్సేనుడికి తొలిపూజతో స్వామివారి బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంలోని గర్భాలయం ఎదుట పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో దివ్య మనోహరంగా అలంకరించిన ఉత్సవమూర్తులను ప్రత్యేక పీఠంపై అధిష్ఠింపజేశారు. ఉత్సవాలు నిర్విఘ్నంగా సాగడానికి నిర్దేశించిన మంత్రోచ్చరణలతో తొలిపూజా పర్వాలను నిర్వహించారు.



బ్రహ్మోత్సవ సంకల్ప పూజలు

బ్రహ్మోత్సవాల్లో ఆగమశాస్త్ర ప్రకారం జగద్రక్షకుడు లక్ష్మీనృసింహుడికి అర్చకులు రక్షా సూత్రధారణ చేసి మహోత్సవ పర్వాలు నిర్విఘ్నంగా చేపట్టేందుకు ప్రధానార్చకులతో పాటు అర్చకబృందం కంకణాలు ధరించారు. అనంతరం నిర్వాహకులను దీక్షాబద్ధులను చేస్తూ అర్చకులు అనువంశిక ధర్మకర్త బీ.నర్సింహమూర్తి, కార్యనిర్వహణాధికారి రామకృష్ణారావుతో పాటు ముఖ్యమైన అధికారులకు, రుత్వికులకు కంకణధారణ చేశారు. అదేవిధంగా బ్రహ్మోత్సవ ప్రారంభ ప్రాధాన్యంతో చతుర్వేద మంత్రపారాయణాలు, ఉపనిషత్తులు, పంచసూక్తములు, సుదర్శన శతక, రామాయణ భాగవతములు, క్షేత్ర మహత్యాన్ని, మూల మంత్ర పఠనాలు చేశారు.



ఆలయ సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేద పండితులు

స్వస్తిపుణ్యాహావాచనం

దేవదేవుడు లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ ఆరంభానికి యాదగిరిగుట్ట కొండపై పరిసరాలను శాస్త్రోక్తంగా శుద్ధి చేయడానికి స్వస్తిపుణ్యాహావాచన పూజలు నిర్వహించారు. దివ్యమనోహరంగా అలంకృతులైన లక్ష్మీనరసింహుల ఎదుట పంచామృత కళశాలకు, దర్భ(గరక)లతో వేదమంత్రోచ్చరణల నడుమ పూజలు నిర్వహించారు. శాంతి మంత్రపఠనాల అనంతరం ఈ పుణ్యాజలాలతో స్వామి వారికి నిజాభిషేకం నిర్వహించి ప్రధానాలయం, బాలాలయ మండపం, కొండపై నలుదిక్కుల పవిత్ర జలాన్ని సంప్రోక్షిస్తూ స్వస్తిపుణ్యాహావాచనం నిర్వహించారు.




లక్ష్మీనృసింహుల కల్యాణ పట్టువస్త్రాలతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, మంత్రులు

పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం

లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, ఆయన సతీమణి గీతారెడ్డి సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామెల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి, కలెక్టర్ హనుమంత్ కే. జెండగే, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కె.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

చాంద్ ముబారక్

- నేటి నుంచి రంజాన్ మాసం
- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మసీదులు



నల్లగొండ కల్చరల్, మార్చి 11: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. సోమవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కన్పించడంతో మంగళవారం ఉదయం నుంచే కఠిన ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ముస్లింలు ఉపవాస దీక్ష పాటించనున్నారు. రంజాన్ మాసం ప్రారంభమవడంతో ప్రత్యేక ప్రార్థనలకు మసీదులు ముస్తాబయ్యాయి. నెల రోజుల పాటు ఖురాన్ పఠనాలు, నమాజ్, సహార్, ఇఫ్తార్, తరావీ ప్రార్థనలతో మసీదుల్లో సందడి నెలకొననుంది. అదేవిధంగా రంజాన్ మాస ప్రత్యేక వంటకాలైన హరీస్, హలీమ్ దుకాణాలు పట్టణంలో ఏర్పాటు చేశారు.

రంజాన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి అర్బన్, మార్చి 11 : రంజాన్ మాసం నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన శాంతి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవిత్ర మాసం సందర్భంగా శాఖలు సమన్వయంతో కేటాయించిన విధులు నిర్వహించాలన్నారు. మసీదుల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలన్నారు. డీసీపీ రాజేష్‌చంద్ర మాట్లాడుతూ ఇఫ్తార్ విందుల సమాచారమిస్తే సరైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీవో ఎంఏ కృష్ణన్, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, మైనార్టీ శాఖ ఇన్‌చార్జి అధికారి పీ యాదయ్య, డీపీవో సునంద, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జయక్రిష్ణ, డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ గోపీకృష్ణ, శాంతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు పూర్తి సహకారం అందించాలి : కలెక్టర్

భువనగిరి లోక్‌సభ ఎన్నికలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయపార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు నివాసానికి రెండు కిలోమీటర్లకు పైగా దూరమున్న కేంద్రాల మార్పులకు నాలుగు కొత్త అనుబంధ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. భువనగిరి, ఆలేరు, మునుగోడు (చౌటుప్పల్, నారాయణపురం), నకిరేకల్ (రామన్నపేట), తుంగతుర్తి (మోత్కూర్, అడ్డగూడూరు) నియోజకవర్గాలకు సంబంధించి 812 కేంద్రాల్లో మూడు కేంద్రాల లోకేషన్ మార్పు ఉంటుందన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ని రద్దుచేసిన అధికారులు

సమాచారం లేక తరలివచ్చిన అర్జీదారులు



‘ప్రజావాణి’లో అర్జీ ఇచ్చేందుకు వచ్చిన జీపీ కార్మికులు

భువనగిరి అర్బన్, మార్చి 11 : కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు సమాచారం ఇవ్వకుండా రద్దు చేశారు. దీంతో ఎప్పటిలాగే పెద్దసంఖ్యలో అర్జీదారులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదగిరిగుట్టకు వస్తున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు అక్కడికి వెళ్లారు. దీంతో ప్రజావాణిని రద్దు చేశారు. అయితే ముందస్తు సమాచారం లేకపోవడంతో సమస్యలపై విన్నవించేందుకు తరలివచ్చిన ప్రజలకు అర్జీలు ఇబ్బందులు పడ్డారు. కొందరు ఏవోకు వినతులు అందజేశారు. మరికొందరు నిరాశతో వెనుదిరిగారు.

సీఎం పర్యటన నేపథ్యంలోనే రద్దు చేశాం: ఏవో జగన్

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేశాం. పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ జిల్లా యంత్రాంగానికి చేరే సరికి ఆలస్యమైంది. అందువల్ల ముందస్తు సమాచారం ఇవ్వలేకపోయాం. ప్రజలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం.

టికెట్ వరించేదెవరికో?



హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన కేసీఆర్

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడుతుందన్న సమాచారం మేరకు అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపికకు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉండగా, ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ ఒక్కో సీటుకు అభ్యర్థులను ప్రకటించాయి. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థుల కసరత్తు వేగవంతమైంది. సోమవారం హైద్రాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కేసీఆర్ నివాసంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్యనేతలతో సమావేశమయ్యారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- రెండు, మూడురోజుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎంపిక
- ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలతో మాజీ సీఎం కేసీఆర్ భేటీ
- క్యాడర్‌ను సమాయాత్తం చేయాలని సూచన
- శానంపూడి చేరికతో బీజేపీలో ముసలం
- ఎంపీ టికెట్ ఇవ్వవద్దని డిమాండ్

పార్లమెంటు ఎన్నికలకు పార్టీ శ్రేణులను సిద్ధం చేయాలని, రెండు, మూడురోజుల్లో అభ్యర్థుల ఎంపిక ఉంటుందని మాజీ సీఎం కేసీఆర్ పార్టీ ఉమ్మడి జిల్లా నేతలకు సంకేతాలిచ్చారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీ.లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్న ఈ సమావేశంలో తాజా పరిణామాలు, జిల్లాలో చోటు చేసుకున్న మార్పులు, చేర్పులపై కేసీఆర్ ఆరా తీసినట్టు తెలిసింది. హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరిన నేపథ్యంలో క్యాడర్ నైరాశ్యానికి గురికాకుండా నియోజకవర్గంలో చర్యలు తీసుకోవాలని కేసీఆర్ సూచించినట్టు సమాచారం. జిల్లాలోని రెండు లోక్‌సభ సీట్లకు సామాజిక సమీకరణాలు, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులకు దీటైనపోటీ ఇచ్చే నేతలను ఎంపికచేయాలని ముఖ్యనేతలు ఈ సందర్భంగా సూచిస్తున్నట్టు తెలిసింది.

శానంపూడి చేరికను వ్యతిరేకిస్తున్న బీజేపీ నేతలు

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని బీజేపీలో చేర్చుకోవడంపై పార్టీలో అసంతృప్తి చెలరేగుతోంది. ఉమ్మడి జిల్లా నేతలను, కార్యకర్తలను కనీసం సంప్రదించకుండా నేరుగా ఎలా చేర్చుకుంటారని ముఖ్యనేతలు, క్యాడర్ బీజేపీ అధిష్ఠానాన్ని ప్రశ్నిస్తోంది. సోమవారం బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ వెళ్లి సైదిరెడ్డిపై వారి అభ్యంతరాలను నివేదించారు. ఆయన్ను పార్టీలో చేర్చుకున్నప్పటికీ, ఎంపీ టికెట్ మాత్రం ఇవ్వవద్దని కోరారు. ఈ మేరకు పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్‌కు వినతిపత్రం కూడా అందజేశారు. బీజేపీకి చెందిన ఉమ్మడి జిల్లా మాజీ కీలక ప్రజాప్రతినిధి సైదిరెడ్డి చేరికపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారని, పార్టీ నిర్ణయాలు ఇలా ఏకపక్షంగా ఉంటే తమదారి తాము చూసుకోవాల్సి ఉంటుందని అల్టిమేటం జారీ చేసినట్టు చెబుతున్నారు. బండి సంజయ్‌కుమార్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీజేపీ కార్యకర్తలను సైదిరెడ్డి ఇబ్బందిపెట్టారని, గుర్రంబోడు తండా భూముల విషయంలో బీజేపీ కార్యకర్తలపై కేసులు పెట్టించారని, బండి సంజయ్ పర్యటన సందర్భంగా దాడుల్లో ఆయన పాత్ర ఉందని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ కార్యకర్తల్ని తీవ్రస్థాయిలో ఇబ్బంది పెట్టిన మాజీ ఎమ్మెల్యేను పార్టీలో ఎలా చేర్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఓ వైపు నల్లగొండ పార్లమెంటు స్థానంలో గట్టి పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో పాటు, బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేను బీజేపీ చేర్చుకోగా, సదరు మాజీ ఎమ్మెల్యేపై పాత క్యాడర్, నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం తలనొప్పిగా మారింది. ఈ వివాదాన్ని అధిష్ఠానం ఎలా పరిష్కరిస్తుందో చూశాకే తదుపరి నిర్ణయం ఉంటుందని సైదిరెడ్డి చేరికను వ్యతిరేకిస్తున్న నేతలు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఉత్కంఠ

ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వాలు ఎవరికి దక్కుతాయనే అంశంపై పార్టీలో చర్చ కొనసాగుతోంది. పోటీ నుంచి విరమించుకున్నట్టు ప్రకటించిన శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి సోమవారం కేసీఆర్‌తో జరిగిన భేటీకి కూడా హాజరుకాలేదు. నల్లగొండ స్థానంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ తేరా చిన్నపరెడ్డి, తెలంగాణ ఉద్యమనేత చాడ కిషన్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తున్నట్టు తెలిసింది. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి ఉద్యమనేత జిట్టా బాలకృష్ణారెడ్డి, క్యామ మల్లేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తోంది.

భువనగిరిలో నయీం అనుచరుడి వీరంగం

- వేటకత్తితో ల్యాబ్ నిర్వాహకుడిపై హత్యాయత్నం
- చెవి, వీపుపై గాయాలు
- అప్రమత్తమై పరుగెత్తిన బాధితుడు



కత్తితో బాబా వెంటపడుతుండగా పరుగెడుతున్న నరేష్‌గౌడ్

భువనగిరి టౌన్, మార్చి 11: జిల్లా కేంద్రం భువనగిరిలో ఓ ల్యాబ్ నిర్వాహకుడిపై నయీం అనుచరుడు, రౌడీషీటర్ చేసిన హత్యాయత్నం చేయడం సంచలనం సృష్టించింది. ఈ ఘటన నుంచి బాధితుడు త్రుటిలో తప్పించుకోగా, దాడికి ఉపయోగించిన కత్తిని దాచిపెట్టిన నిందితుడు తాపీగా హోటల్‌లో కూర్చుని టీ తాగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భువనగిరి పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భువనగిరిలోని ఏరియా ఆసుపత్రి సమీపంలోని సాయితేజ డయాగ్నస్టిక్ ఎదుట నిర్వాహకుడు శిగ నరేష్‌గౌడ్ ఉదయం 10గంటల సమయంలో నిలబడి మాట్లాడుతున్నాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన నయీం అనుచరుడైన మాజీ నేరస్తుడు, అంబులెన్స్ డ్రైవర్ ఎండీ బాబా వేటకత్తితో వెనుకనుంచి దాడి చేశాడు. ఈ క్రమంలో నరేష్ చెవితో పాటు వీపులో కత్తిపోటు గాయాలయ్యాయి. దాడితో అప్రమత్తమైన నరేష్‌గౌడ్ తప్పించుకుని పారిపోతుండగా నిందితుడు వేటకత్తితో వెంటాడాడు. కొద్దిదూరం వెంబడించినా నరేష్‌గౌడ్ దొరక్కపోవడంతో సమీపంలో ఉన్న ఓ బస్తీలో పాత ఇంటిపై వేటకత్తిని దాచిపెట్టిన నిందితుడు స్థానిక సమ్మద్ చౌరస్తా వద్ద ఓ హోటల్‌లో టీ తాగుతూ తాపీగా కూర్చున్నాడు. సంఘటన విషయం తెలిసిన పోలీసులు టీ తాగుతున్న బాబాను అదుపులోకి తీసుకున్నారు. బాబాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న సమాచారం అనంతరం నరేష్‌గౌడ్ ఏరియా ఆసుపత్రికి వెళ్లగా సిబ్బంది చికిత్స చేశారు. బాధితుడు నరేష్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా, తన ల్యాబ్‌ను మూసివేయాలని నయీం అనుచరులు గతంలో తనను కిడ్నాప్ చేశారని, పలుమార్లు బెదిరించి దాడి చేశారని పేర్కొంటూ నరేష్ వీడియోను విడుదల చేయడం, నరేష్‌పై దాడి చేసేందుకు ఓ ల్యాబ్ నిర్వాహకుడితో రూ.25వేలు సుపారీ కుదుర్చుకుని రూ.5వేలు అడ్వాన్సుగా ఇవ్వడంతోనే దాడి చేశానని పోలీసులతోనే స్వయంగా బాబా పేర్కొంటుండటం సంచలనంగా మారింది.

చికిత్సతో కుష్ఠు వ్యాధి తగ్గుముఖం: డిప్యూటీ డీఎంహెచ్‌వో



కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శిల్పిని

భువనగిరి టౌన్,మార్చి 11 : చికిత్సతో కుష్ఠువ్యాధి తగ్గుతుందని, వ్యాధిగ్రస్థులు గోప్యత పాటిస్తే ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శిల్పిని అన్నారు. సోమవారం భువనగిరిలో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుష్ఠు వ్యాధికి ఉచిత పరీక్షలు, చికిత్సలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. గుర్తింపు కోసం ఇంటింటికీ వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు. వ్యాధి లక్షణాలు సోకిన వారు అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. అవసరమైన చికిత్సలు పొందాలన్నారు. కార్యక్రమంలో టీపీఎంవోలు ధరణికుమార్,జ్యోతి, సతీష్‌కుమార్, సిబ్బంది ఎండీ బషీరుద్దీన్, సునంద, శోభ, మంజుల పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలి

ఓబీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ నరేందర్



నివాళులర్పిస్తున్న బీసీ మహా పాదయాత్ర నాయకులు

మోత్కూరు, మార్చి 11 : జనాభాలో 55శాతంగా ఉన్న బీసీలు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు సాధించుకునేందుకు పోరాడాలని ఓబీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ సాయిని నరేందర్, హిందూ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ నెల 1న మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించిన బీసీ మహాపాదయాత్ర 211 కిలోమీటర్లు ప్రయాణించి సోమవారం మోత్కూరు చేరుకుంది. మోత్కూరులో కొండా లక్ష్మణ్‌బాపూజీ, దొడ్డి కొమురయ్య, సర్ధార్ సర్వాయి పాపన్న, జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అగ్రకుల ఆధిపత్యం, పెట్టుబడిదారీ రాజకీయ వ్యవస్థలో సామాన్య బీసీలు చట్టసభలకు పోటీచేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ దుస్థితికి కారణం బీసీలకు రాజ్యాంగబద్ధంగా చట్టసభల్లో దామాషా ప్రకారం వాటా లేకపోవడమేనని బీసీలు గుర్తించాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. మోత్కూరుకు చేరుకున్న పాదయాత్రకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, పటేల్ వనజ, వెలుగు వనిత, సింగారపు అరుణ, బుచ్చిబాబు, గడిపె విమల, బాలస్వామి, శ్రీను, శ్రవణ్‌కుమార్, శ్రీహరి, స్థానిక నాయకులు అవిశెట్టి అవిలిమల్లు, గుండగోని రామచంద్రు, పోచం సోమయ్య, పోచం యాదగిరి, గనగాని నర్సింహా, మొరిగాల వెంకన్న, ఎడ్ల శ్రీనివాస్, ఉయ్యాల అంజయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా యాత్ర సోమవారం రాత్రి మండలంలోని పొడిచేడు గ్రామానికి చేరుకుంది.

కోదాడలో రూ.33.68లక్షల
ఔషధాలు స్వాధీనం

రూ.1.31లక్షల గడువు తీరిన మందుల గుర్తింపు

నాలుగు గోదాంలను సీజ్ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు



కోదాడలోని గోదాముల్లో నిల్వ చేసిన ఔషధాలను తనిఖీ చేస్తున్న అధికారులు


కోదాడ, మార్చి 11: సూర్యాపేట జిల్లా కోదాడలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన రూ.33.68లక్షల ఔషధాలను ఔషధ నియంత్రణ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సూర్యాపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోదాడలోని గోదాముల్లో అనుమతి లేకుండా భారీగా ఔషధాలను నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు ఖమ్మం, నల్లగొండ, వరంగల్, సూర్యాపేట జిల్లాలకు చెందిన అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అనుమతి తీసుకోకుండా కోదాడ పట్టణంలోని సురేష్ ఆర్థోపెడిక్ ఆసుపత్రి మూడో ఫ్లోర్‌లో నిల్వఉంచిన రూ.12.30లక్షల విలువైన ఔషధాలు,భవానీ మెడికల్ దుకాణంలో రూ.12.25లక్షలు, చెన్నకేశవ గోదాంలో రూ.3.04లక్షలు, మహిత మెడికల్ గోదాంలో రూ.6.09లక్షలు మొత్తంగా నాలుగు గోదాముల్లో రూ.33.68 లక్షల విలువైన ఔషధాలను గుర్తించారు. వాటిలో రూ.1.31లక్షల విలువైనవి గడువు తీరినవిగా నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న ఔషధాలతోపాటు గోదాములను సీజ్ చేశారు. తనిఖీల్లో వరంగల్ డీటీ ఆర్యవర్ధనచారి, నల్లగొండ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేదాస్, డీఐ సోమేశ్వర్, ఖమ్మం ఏడీ ప్రసాద్, సూర్యాపేట డీఐ సురేందర్, భువనగిరి డీఐ అశ్విన్, ఖమ్మం డీఐ అనిల్, హన్మకొండ డీఐ కిరణ్, జనగామ డీఐ బాలకృష్ణతో పాటు ఆరుగురు సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీలో చంద్రబాబుపై మరో కేసు

» అసైన్డ్ భూముల కేసులో ఏ-40గా చేర్చిన సీఐడీ

విజయవాడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వం మరో కేసు నమోదు చేసింది. ఇప్పటి వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫైబర్‌గ్రిడ్ కేసుల్లో నిందితుడిగా చేర్చిన సీఐడీ.. తాజాగా అసైన్డ్ భూముల కేసు ఎఫ్ఐఆర్‌లోనే గాక చార్జిషీటులోనూ నిందితుడి(ఏ-40)గా పేర్కొంది. రాజధాని అమరావతిలో వెలగపూడి, ఉద్దండరాయునిపాలెం, మందడం, రాయపూడి గ్రామాల్లో ఉన్న అసైన్డ్ భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేశారని వరప్రసాదరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మాజీ మంత్రి పి.నారాయణ, ఆయన కుటుంబ సభ్యులపై సీఐడీ గతంలో కేసులు (క్రైం నంబర్ 14/2020, 15/2020) నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్‌లలో ఎక్కడా చంద్రబాబు పేరు లేదు. ఇప్పుడు 14/2020 కేసులో ఆయనతో పాటు 22 మందిని నిందితులుగా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సోమవారం చార్జిషీటు, మెమో దాఖలు చేసింది. వీరిలో నారాయణ బంధువు పి.సుబ్రహ్మణ్యాన్ని ఏ-41గా చేర్చింది. వీరందరిపై ఐపీసీ 120బీ, 420, 506 రెడ్‌విత్ 120బీ సెక్షన్లు, అసైన్డ్ భూముల బదిలీ నిషేధం చట్టంలోని సెక్షన్ 7, ఎస్సీ, ఎస్టీ చట్టంలోని 3(1)(జీ), (2)(వీఏ) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2 కేసులకు సంబంధించి ఒకటే చార్జిషీటును కోర్టుకు సమర్పించారు. కాగా, యువగళం ముగింపు సభలో లోకేశ్ చేసిన రెడ్‌బుక్ వ్యాఖ్యలపై సీఐడీ వేసిన పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలుకు ఆయన తరఫు న్యాయవాది లక్ష్మీనారాయణ సమయం కోరారు. ఈ కేసుకు సంబంధించిన పిటిషన్లు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీంతో న్యాయాధికారి హిమబిందు విచారణను 21వ తేదీకి వాయిదా వేశారు.

నేటి నుంచే రంజాన్


రంజాన్‌కు ముస్తాబైన మక్కా మసీద్

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు భావిస్తారు. అలాగే ఎంతో శుభప్రదమైన ఈ నెలలో నరకలోక ద్వారాలు మూసుకుని, స్వర్గలోకపు ద్వారాలు తెరుచుకుంటాయని వారు నమ్ముతారు. దేవునిపై విశ్వాసాన్ని, భయభక్తులను, భక్తిశ్రద్ధలను తెలుపుకునేందుకు ముస్లింలు రోజా (ఉపవాస దీక్షలు) పాటిస్తారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ ఐదుపూటలా నమాజు, ఇషా తరువాత తరావీహ్ (ప్రత్యేక ప్రార్థనలే)తో పాటు అర్ధరాత్రి పూట తహజ్జుద్ నమాజ్ పేరుతో ఏకాంత ఆరాధనలో లీనమవుతుంటారు. చివరి పది రోజులలో ఎతేకాఫ్ పాటిస్తారు. అలాగే ధనవంతుడైన ప్రతి ముస్లిం దానధర్మాలకు అధిక ప్రాధాన్యమిస్తారు. తమ ఆస్తిలో రెండున్నర శాతం తీసి పేదలకు పంచిపెడతారు. నెల రోజుల అనంతరం నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించి రంజాన్ పండుగ (ఈదుల్ ఫితర్)ను జరుపుకుంటారు. మరోవైపు రంజాన్ నెలవంక దర్శనంతో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పాతబస్తీలో మటన్, చికెన్ షాపులు, కూరగాయల మార్కెట్‌లు, కిరాణా షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ముస్లింలకు సీఎం రంజాన్ శుభాకాంక్షలు

నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణనిస్తుందని అన్నారు. ముస్లిం సోదరులు రంజాన్ మాస వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, ప్రార్థనలతో అల్లా దీవెనలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ముస్లింల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించి, వారి అభ్యున్నతికి తోడ్పడే కార్యక్రమాలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఆనాడు కేసీఆర్ పేషీలో
ఒక్క దళితుడున్నారా?

చిన్న సంఘటనపై బీఆర్ఎస్ విష ప్రచారం.. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల అయిలయ్య

హైదరాబాద్/న్యూఢిల్లీ/జగిత్యాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన పేషీలో ఒక్క దళితుడైనా ఉన్నారా అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో జరిగిన చిన్న సంఘటనను చూపి ఏదో అయినట్లు బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు చేస్తోందని మండిపడ్డారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.. తెలంగాణ తొలి సీఎంగా దళితుడిని చేస్తానన్న కేసీఆర్.. చేశాడా అని ప్రశ్నించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆయన ఎలా అవమానించిందీ ప్రజలే చూశారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళిత మంత్రులు ఎన్నిసార్లు కలవగలిగారని ప్రశ్నించారు. యాదగిరిగుట్టలో పూర్వమున్న వసతులనూ సీఎం రేవంత్ కల్పిస్తున్నారని.. గుట్టలో నిద్రచేసే వెసులుబాటు, కొబ్బరికాయలు కొట్టేందుకు ఏర్పాట్లు చేశారని విప్ అయిలయ్య అన్నారు. కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందని చెప్పి.. డిప్యూటీ సీఎం భట్టికి అవమానం జరిగిందంటూ బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. భట్టి కూర్చున్న కుర్చీ చిన్నగా ఉన్నందు వల్ల అలా కనిపిస్తోందని వివరణ ఇచ్చారు. మేనేజ్‌మెంట్ కోటాలో వచ్చిన కేటీఆర్‌కు.. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ అన్నారు. సీఎంను గురించి ఆయన పిచ్చిమాటలు మాట్లాడితే ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రిలో చేర్చడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ గురించి అనవసర వ్యాఖ్యలు చేస్తే హైదరాబాద్‌లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల్లో సీఎం రేవంత్‌కు ఉన్న ఆదరణ చూసి కేటీఆర్ ఓర్చుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. 'బిడ్డా కేటీఆర్..! మా సీఎం రేవంత్‌పైన మాట్లాడే స్థాయి నీకుందా? నీ భాష మార్చుకోక పోతే బట్టలు ఊడదీసి ఉరికిస్తం.. నువ్వు మొగోనివైతే లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్లలో మెజారిటీ తెచ్చి చూపించు!'అని సవాల్ విసిరారు. రేవంత్ పట్ల కేటీఆర్ మాట్లాడిన తీరు జుగుప్సాకరంగా ఉందంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. కేసీఆర్ ఎక్కడ రాజకీయాలు మొదలుపెట్టి ఎక్కడ మంత్రి, డిప్యూటీస్పీకర్ అయ్యారో కేటీఆర్ చెప్పాలన్నారు. కేటీఆర్ ఇలాగే మాట్లాడితే తెలంగాణ ప్రజలు.. బీఆర్ఎస్‌కు ఉన్న ప్రతిపక్ష హోదా లేకుండా చేసి బయటకు పంపుతారన్నారు.


జగిత్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రెండ్రోజుల్లో గొల్లకురమల కార్పొరేషన్

గొల్ల, కురమల కార్పొరేషన్‌ను మరో రెండ్రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుతో గొల్ల, కురుమలకు లబ్ధి చేకూర్చుతుందన్నారు. గొల్ల కురమలకు బీఆర్ఎస్ పదేళ్ల పాటు అన్యాయం చేసిందని మండిపడ్డారు. గొల్ల కురుమలకు 4 అసెంబ్లీ సీట్లు కేటాయించి.. అధికారంలోకి రాగానే కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం రేవంత్ నిలబెట్టుకుంటున్నారని వెల్లడించారు.

మోదీకి చిత్తశుద్ధి లేదు:వీహెచ్

ఓబీసీ ప్రధాని అని చెప్పుకొనే నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి బీసీలకు ఏం చెప్తారని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రశ్నించారు. కులగణన చేస్తామని ప్రకటించడానికి వస్తున్నారా? అని నిలదీశారు. ఓట్ల కోసం అయోధ్య రామమందిరం, కాశీ గురించి మాట్లాడడమే తప్ప బీసీల అభివృద్ధి పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో వీహెచ్ మాట్లాడుతూ.. కులగణన కోసం మోదీని ఓబీసీ ఎంపీల బృందం ఆధ్వర్యంలో నాలుగు సార్లు కలిసినప్పటికీ హామీ ఇవ్వలేదన్నారు. కాగా, జగిత్యాలలో ఇటీవల జరిగిన మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ రెబల్‌గా పోటీ చేసి విజయం సాధించిన అడువాల జ్యోతి లక్ష్మణ్ కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం జగిత్యాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

22 ఎకరాల నిషేధిత జాబితా భూమి..
ఎంపీ సంతోష్‌కు పట్టా

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. "సంతోష్ అనే బీఆర్ఎస్ ఎంపీ, వారి కుటుంబానికి చెందినవారి పేరుమీద కూడా భూములున్నాయి. అప్పటివరకు 22(ఎ) కింద నిషేధిత జాబితాలో ఉన్న భూమి వారి పేరిట పట్టా అయింది. ఆ గ్రామంలో అందరి భూములూ నిషేధిత జాబితాలో ఉంటాయి. కానీ, ఆయనకు మాత్రం ఆ 22 ఎకరాలు పట్టా అయిపోయింది" అని కోదండరెడ్డి అన్నారు. ఎంపీ సంతోష్ భార్య, ఓ ఎమ్మెల్సీ, ఇద్దరు ఆ పార్టీ నేతలు కలిసి ఒకే గ్రామంలో నిషేధిత జాబితాలో ఉన్న 22 ఎకరాలను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఈ నలుగురికి చెందిన ఒక కంపెనీ పేరుతో ఈ భూముల్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ఎలా పట్టాలుగా మార్చుకున్నారనేందుకు ఇది ఒక్క ఉదాహరణ మాత్రమేనన్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లపై తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. మరోవైపు వివాదరహితంగా ఉన్న 23 లక్షల ఎకరాలను వివాదాస్పద భూముల కేటగిరీ(బీ)లో చేర్చారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనన్ని భూ కుంభకోణాలు ఇక్కడ గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ధ్వజమెత్తారు. ఎవరినీ సంప్రదించకుండా గతంలో దివాళా తీసిన విదేశీ ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి ధరణి నిర్వహణ బాధ్యతలు అప్పగించారని కోదండరెడ్డి తెలిపారు. ఆ తర్వాత ఇదే కంపెనీ టెరాసీస్, క్వాంటెల్లాగా పేర్లు మార్చుకుందని వివరించారు. ఈ మూడు కంపెనీలు రాష్ట్రానికి చెందిన రామలింగరాజు కుటుంబీకుడు శ్రీగారి శ్రీధర్‌రాజు పేరిట ఉన్నాయని తెలిపారు. రామలింగరాజు కుటుంబానికి కేటీఆర్‌తో అవినాభావ సంబంధం ఉందన్నారు. ధరణి పేరుతో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఆ శాఖ మంత్రిగా కూడా ఉన్న గత సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దీనికి ప్రధాన కారణమని కోదండరెడ్డి ఆరోపించారు. కేటీఆర్ తన కార్యాలయంలో ధరణికి సంబంధించి ప్రత్యేకంగా ఒక వ్యవస్థనే పెట్టుకున్నారని తెలిపారు.

17 వరకు స్పెషల్ డ్రైవ్..

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్‌ను మరో వారం రోజులపాటు పొడిగించారు. దరఖాస్తులు భారీగా వస్తున్నందున దీనిని ఈ నెల 17 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొంటూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు 2.45 లక్షల ధరణి దరఖాస్తులు పరిష్కారం దిశగా ఉన్నాయని తెలిపింది.

ప్రణీత్‌రావు ఎక్కడ?

» సిరిసిల్లలో పంజాగుట్ట పోలీసుల గాలింపు
» అదుపులోకి తీసుకున్నట్లుగానూ ప్రచారం?
» పథకం ప్రకారమే ట్యాపింగ్.. డేటా మాయం
» హార్డ్ డిస్కుల ధ్వంసం కేసులో కీలక ఆధారాలు
» గత ప్రభుత్వ పెద్దల అండతో ఎస్ఐబీలో హవా
» ప్రతిఫలంగానే అడ్డదారిలో ఆయనకు పదోన్నతి?
» ప్రణీత్‌కు సహకరించిన అధికారుల్లో గుబులు

హైదరాబాద్ సిటీ, సిరిసిల్ల క్రైం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సస్పెండైన డీఎస్పీ ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావు ఎక్కడ ఉన్నారనేది తెలియడం లేదు. ఫోన్‌లు స్విచ్ఛాఫ్ ఉండడంతో పాటు, అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తూ ఆయనను పట్టుకునేందుకు హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సోమవారం వీరు సిరిసిల్ల వచ్చి స్థానిక శ్రీనగర్ కాలనీలో ప్రణీత్ అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద రాత్రి వరకు పహారా కాసినట్లు తెలిసింది. ఓ దశలో అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏ సమయంలోనైనా హైదరాబాద్ తరలించే అవకాశం ఉందని ఊహాగానాలు వచ్చాయి. అయితే, ప్రణీత్ విషయం తమకు తెలియదని, పంజాగుట్ట పోలీసులకే సమాచారం ఉంటుందని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పంజాగుట్ట పోలీసులు సైతం ప్రణీత్ ఇంకా దొరకలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) డీఎస్పీగా పనిచేస్తున్న ప్రణీత్ ఫిబ్రవరి 20న బదిలీపై సిరిసిల్ల డీసీఆర్బీలో చేరారు. రిపోర్టు చేసిన వెంటనే హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలిసింది. ట్యాపింగ్ ఆరోపణలతో ఈ నెల 5న సస్పెండయ్యారు. కాగా, ఎస్ఐబీ కార్యాలయంలో.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటి రోజు ప్రతిపక్ష నాయకుల ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్ డిస్కులను ప్రణీత్ ధ్వంసం చేశారని ఆదివారం అదనపు ఎస్పీ రమేష్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్‌తో పాటు, మరికొందరిపై పంజాగుట్ట స్టేషన్‌లో ఐపీసీ 409, 427, 201, 120(బి), సెక్షన్(3) ఆఫ్ పీడీపీపీ యాక్ట్, 65, 66, 70 ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదయ్యాయి.

పథకం ప్రకారం ఎస్ఐబీకి.. 'అద్భుత పనితీరు'తో డీఎస్పీ

గత ప్రభుత్వంలోని పెద్దలతో దగ్గరి బంధుత్వం ఉండడం, వారి అండతో ప్రణీత్ పథకం ప్రకారం ఎస్ఐబీకి వెళ్లి చక్రంతిప్పినట్లు పోలీసులు కీలక సమాచారం సేకరించారు. 2007 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన 2018లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. అనంతరం ఎస్ఐబీకి మార్చగా ఆ విభాగం ఉన్నతాధికారుల తోడ్పాటుతో రెండు గదుల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో 17 కంప్యూటర్లను అనధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా, అనధికారికంగా, చట్ట విరుద్ధంగా సేకరించడమే కాక స్వయంగా పర్యవేక్షించినట్లు కచ్చితమైన ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఎన్నికల ఫలితాలు విడుదలైన మరుసటి రోజే ఎస్ఐబీ కార్యాలయంలో సీసీ కెమెరాలు బంద్ చేయించి, టెక్నీషియన్ సాయంతో కంప్యూటర్లలోని డేటా, కీలక వివరాలు కాపీ చేసుకుని, హార్డ్ డిస్కులను ధ్వంసం చేసి కాల్చివేశారు. తనపై అనుమానం రాకుండా కొత్త హార్డ్ డిస్కులను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. కాగా, చెప్పినట్లు చేసినందుకు 'అద్భుతమైన పనితీరు' కింద నిరుడు మార్చిలో ప్రణీత్‌కు డీఎస్పీగా పదోన్నతి ఇచ్చారు. దీనిపై ఆయన బ్యాచ్‌మేట్స్, ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయినట్లు తెలిసింది. మరోవైపు ట్యాపింగ్‌లో కొందరు అధికారులకూ పాత్ర ఉన్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. ప్రణీత్ తర్వాత వీరినీ విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక సమాచారం మేరకు ఈ కుట్రలో ఎవరి పాత్ర ఎంత..? అనేది దానిపై దర్యాప్తు చేస్తున్నారు. కేసు సంచలనంగా మారుతుండడంతో ప్రణీత్‌కు సహకరించిన ఉన్నతాధికారుల్లో గుబులు మొదలైంది.

సీఎం సార్... మా మొర ఆలకించండి!

» ఆర్ అండ్ బీలో సర్వీస్ రూల్స్ ఖరారు చేయండి
» సీఎం రేవంత్‌కు, మంత్రి కోమటిరెడ్డికి ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్ అంశాన్ని పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. గత ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దాంతో తమకు పదోన్నతులు వచ్చినా అవి తాత్కాలికమే కావడంతో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్థాయి హోదాలోనే పదవీ విరమణ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆర్ అండ్ బీ లో పెండింగ్‌లో ఉన్న సర్వీస్ రూల్స్‌ను పరిష్కరిస్తే దాదాపు 300 నుంచి 400 మంది ఉద్యోగులకు పదోన్నతులు కలుగుతాయన్నారు. వాస్తవానికి ఆర్ అండ్ బీ పదోన్నతుల అంశం ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితాపై ఆధారపడి ఉన్నప్పటికీ సర్వీస్ రూల్స్ తేలితే కిందిస్థాయి పదోన్నతులు ఒక కొలిక్కి వస్తాయని ఉద్యోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో సర్వీస్ రూల్స్ పూర్తయ్యాయని, తమ శాఖలోనూ అందుకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తయినా గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయిందని పలువురు ఉద్యోగులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కాగా సర్వీస్‌రూల్స్‌ను ఖరారు చేస్తే ఆర్ అండ్ బీలో జరిగిన పునర్వ్యవస్థీకరణతో ఏర్పడిన కొత్త కార్యాలయాలకు సిబ్బంది పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

తవ్విన కొద్దీ బయటపడుతున్న
అక్రమ పౌరసత్వాలు!

» తాజాగా 125 పెరిగిన సంఖ్య.. 24 మంది అరెస్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విదేశీయులకు అడ్డదారుల్లో పౌరసత్వం ఇచ్చిన కేసులో సీఐడీ దర్యాప్తును ముమ్మరం చేసింది. భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించి.. నకిలీ గుర్తింపు, విద్య, ఇతర ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా పాస్‌పోర్టులు పొందిన వారి సంఖ్య తొలుత 95గా గుర్తించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు అనుబంధంగా మరికొన్ని చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదవుతుండడం.. ఈ ముఠాలకు పశ్చిమబెంగాల్‌లోని ఫేక్ సర్టిఫికెట్ల గ్యాంగ్‌తో లింకులను సీఐడీ నిర్ధారించింది. కొత్తగా మరో 30 మంది ఇలా అక్రమంగా పాస్‌పోర్టులు తీసుకున్నట్లు గుర్తించారు. దీంతో.. నకిలీ పత్రాలతో పౌరసత్వాన్ని పొందిన విదేశీయుల సంఖ్య 125కు చేరింది. చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్ మురళీధరన్ రాధ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లు తేల్చారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తే.. ఈ సంఖ్య మరింత పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. కాగా.. ఈ కేసులో సీఐడీ ఇప్పటి వరకు 24 మందిని అరెస్టు చేసింది. విదేశాలకు వెళ్లినట్లు గుర్తించిన వ్యక్తుల వివరాలను ఇప్పటికే ఇమిగ్రేషన్, పాస్‌పోర్టు అధికారులు అందజేశామని, వారిని భారత్‌కు రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు అరెస్టయిన వారిలో హైదరాబాద్‌కు చెందిన ఫేక్‌సర్టిఫికెట్ల తయారీదారుడు అబ్దుల్ సత్తార్, డి.అశోక్‌రావు, మరియప్పన్, మునీందర్, చాంద్‌ఖాన్, హబీబుల్లా జైలులో ఉండగా.. మిగతా వారు బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఏపీలో బీజేపీకి 6 ఎంపీ, 10 అసెంబ్లీ సీట్లు

» 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ
» 8 గంటలపాటు మూడు పార్టీల నేతల భేటీ

అమరావతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పొత్తుల్లో ఎవరికి ఎన్ని సీట్లు అనే అంశంపై టీడీపీ, జనసేన, బీజేపీ తుది నిర్ణయానికి వచ్చాయి. సోమవారం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ ప్రతినిధులుగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, ఎంపీ వైజయంత్ పాండే సుమారు 8 గంటలు చర్చలు జరిపారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఈ భేటీ జరిగింది. అనంతరం... ఏ పార్టీ ఎన్ని సీట్లలో పోటీ చేయనున్నదీ వివరిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం... తెలుగుదేశం పార్టీ 17 పార్లమెంటు, 144 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తుంది. జనసేన రెండు లోక్‌సభ, 21 అసెంబ్లీ స్థానాల్లో బరిలో దిగనుంది. ఇక.. బీజేపీ ఆరు పార్లమెంటు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయనుంది. పొత్తుల్లో భాగంగా బీజేపీ, జనసేనకు కలిపి 8 పార్లమెంటు, 30 అసెంబ్లీ స్థానాలను ఇవ్వాలని తొలుత భావించారు. ఇప్పుడు... అసెంబ్లీ స్థానాల సంఖ్య 31కి పెరిగింది. తొలుత జనసేనకు 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లు ఇచ్చారు. బీజేపీతో పొత్తు అనంతరం జనసేన ఒక ఎంపీ స్థానాన్ని, 3 అసెంబ్లీ స్థానాలను త్యాగం చేయాల్సి వచ్చింది. టీడీపీ కూడా ఒక అసెంబ్లీ స్థానాన్ని తగ్గించుకోవాల్సి వచ్చింది.

వివేకా హత్య కేసులో శివశంకర్‌రెడ్డికి బెయిల్

» సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ఆంధ్రలో అడుగుపెట్టొద్దు
» రెండు పూచీకత్తులు సమర్పించాలి: తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్మోహన్‌రెడ్డి చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక నిందితుడు (ఏ-5) దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అధిక శాతం సాక్షులు ఉన్న ఆంధ్ర రాష్ట్రంలోకి సీబీఐ కోర్టు అనుమతి లేకుండా ప్రవేశించరాదని స్పష్టం చేసింది. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, రెండు పూచీకత్తులు సమర్పించాలని.. ప్రతి సోమవారం హైదరాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. పిటిషనర్ సీబీఐ కోర్టులో పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని.. దర్యాప్తునకు సహకరించాలని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం ఆదేశాలిచ్చారు. శివశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గతేడాది సెప్టెంబర్లో హైదరాబాద్ సీబీఐ కోర్టు కొట్టివేసింది. ఈ హత్య కేసులో 2021 నవంబర్ నుంచి జైల్లో ఉంటున్నానని.. సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టేసి బెయిల్ మంజూరు చేయాలని ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ మేరకు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తే సీబీఐ లేదా సునీతారెడ్డి ఆయన బెయిల్ రద్దుచేయాలని కోరవచ్చంటూ విచారణను ముగించింది.

జేబీబీ పార్టీలో చేరిన కోడికత్తి శ్రీను

» అమలాపురం నుంచి ఎన్నికల బరిలోకి...

విజయవాడ(ఆంధ్రజ్యోతి), ముమ్మిడివరం, మార్చి 11: జనిపల్లి శ్రీనివాసరావు(కోడికత్తి శ్రీను) రాజకీయ రంగప్రవేశం చేశారు. సోమవారం ఆయన జై భీమ్‌రావ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం రాణేలంక పెదపేటలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో సామాన్యులకు న్యాయం జరిగే వరకు తాను పోరాటం సాగిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా అవి సక్రమంగా అర్హులకు చేరడం లేదన్నారు. అమలాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు.

మా కుటుంబం త్వరలోనే టీడీపీలోకి: మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 11: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో అద్భుతాలు జరుగడం ఖాయమని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లాలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసే విధంగా కృషిచేస్తానని తెలిపారు. సోమవారమిక్కడ ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన కుమారుడు రాఘవరెడ్డితో కలిసి తాను పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.



యాదగిరిగుట్టలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు





సీఎం రేవంత్‌రెడ్డి వెంట విప్ బీర్ల అయిలయ్య, పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధానాలయ ముఖమండపంలో స్వస్తిపుణ్యావాచన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుట్టలో బ్రహ్మోత్సవ వైభవం



సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేద పండితులు



స్వామివారికి వస్త్రాలు తీసుకెళ్తున్న దేవస్థాన సిబ్బంది

స్వాగత తోరణంలో స్వామివారి ప్రతిమ మరిచిన అధికారులు



యాదగిరిగుట్ట రూరల్: రాష్ట్రంలో అతి పెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధికారులు గుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా వద్ద ఏర్పాటుచేసిన స్వాగత తోరణంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి మతిమను విస్మరించారు. తోరణం వీక్షిస్తున్న భక్తులు, ప్రజలు స్వామి వారి ప్రతిమ లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పోచంపల్లి పట్టువస్త్రాలు



లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలకు పట్టు వస్త్రాలతో బయల్దేరిన చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిరికి పుట్టింటివారిగా పద్మశాలీయులు పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో పోచంపల్లి పట్టువస్త్రాలు తయారు చేయించి సోమవారం అంకురార్పణ రోజున సమర్పించారు. పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం నగర ఊరేగింపు నిర్వహించారు. అనంతరం యాదగిరిగుట్టలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయానికి చేరుకుని పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమాల్లో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు శ్రేష్ఠి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, తడక వెంకటేష్, బడుగు చండికేశ్వర్, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అధ్యక్షుడు భారత లవకుమార్, కర్నాటి వేంకట బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'గుట్ట'కు చేరిన స్వామివారి అఖండజ్యోతి యాత్ర



అఖండజ్యోతికి స్వాగతం పలుకుతున్న భక్తులు

యాదగిరిగుట్ట రూరల్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా హైదరాబాద్ బర్కత్‌పుర యాదాద్రి భవనం వద్ద ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రారంభించిన అఖండజ్యోతి పాద యాత్ర యాత్ర సోమవారం గుట్టకు చేరుకుంది. యాత్రకు ఆలయ అధికారులు, ప్రభుత్వ విప్ సతీమణి బీర్ల అనిత, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, గౌళికార్ అరుణారాజేష్ స్వాగతం పలికారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

చౌటుప్పల్ టౌన్, మార్చి 11: విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి ఫలితాలు సాధించాలని కాళోజీ పురస్కార గ్రహీత జయరాజ్ అన్నారు. చౌటుప్పల్‌లోని చందన స్కూల్‌లో ఆదివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్ విజేతలకు షీల్డ్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సామాజిక వైద్యాధికారి బడుగు శ్రీరాములు, తాటి రమేష్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తాడూరి పరమేష్, చిత్రకారుడు కూరెళ్ల శ్రీనివాస్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎ. రామేశ్వరీ, డైరెక్టర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

చౌటుప్పల్ టౌన్, మార్చి 11: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మునిసిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్ర మంలో కౌన్సిలర్ సుల్తాన్ రాజు, మునిసిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుర్వి నర్సింహగౌడ్, సీతారామ చంద్ర స్వామి దేవస్థాన చైర్మన్ బొబ్బిళ్ల మురళి, సీపీఎం పట్టణ సహాయ కార్యదర్శి దండ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

వలిగొండ, మార్చి 11: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించనున్న విజయ సంకల్ప సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ సమ్మేళానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు దంతూరి సత్తయ్యగౌడ్, సీలోజు శ్రీరాములు, కనతాల అశోక్‌రెడ్డి, నాగెళ్లి సుధాకర్‌గౌడ్, బందారపు రాములు, మారోజు అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 11: పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ సిబ్బంది బిల్లులను చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పాండు, చాగంటి వెంకటయ్య డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. బకాయి వేతనాల చెల్లింపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి. సుధాకర్, రాంచందర్, వెంకటేశ్వర్లు, బాధవి, యాదమ్మ, కొప్పుల శంకర్, దశరథ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' సమస్యలు పరిష్కరించాలి

సంస్థాన్ నారాయణపురం, మార్చి 11: గృహజ్యోతి పథకం దరఖాస్తుల స్వీకరణలో జరుగుతున్న జాప్యాన్ని అరికట్టి అర్హులైన పేదలందరికీ జీరో బిల్లు వర్తింపజేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సుర్వీరాజుగౌడ్ డిమాండ్ చేశారు. గృహజ్యోతి సమస్యలు పరిష్కరించాలని సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గృహజ్యోతి పథకాన్ని అర్హులైన పేదలందరికీ వర్తింపజేయకుండా 25శాతం మాత్రమే వెరిఫికేషన్ చేశారని, మిగతా లబ్ధిదారులందరికీ కరెంటు బిల్లు వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వంగరి రఘు, నందగిరి జగత్‌కు మార్, సంపతి సుధాకర్‌రెడ్డి, ఏలే అశోక్, వంటల గణేష్, రాపర్తి ప్రదీప్‌గౌడ్, ఉష్కాగుల గిరి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేందర్ గుప్తా



భువనగిరి టౌన్, మార్చి 11: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భువనగిరి పట్టణానికి చెందిన చందా మహేందర్ గుప్తా నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ సోమవారం నియామకపత్రం అందజేశారు. కాగా మహేందర్ గత జిల్లా కమిటీలో ఉపాధ్యక్షుడిగా పనిచేశాడు. రెండుసార్లు మున్సిపల్ కౌన్సిలర్ పనిచేశారు. ఆ పార్టీ మున్సిపల్ ఫోర్ల్ లీడర్‌గా, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, పట్టణ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు.

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

భువనగిరి రూరల్, మార్చి 11: ఎన్నికల సమయంలో వివిధ రాజకీయ పార్టీలకు వివిధ సంస్థలు కార్పొరేట్ శక్తులు డబ్బులు చెల్లించి ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా విరాళాలు తీసుకున్న వివరాలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం వెంటనే బహిర్గత పర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి. జహంగీర్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల బాండ్ల విక్రయం ద్వారా రాజకీయ పార్టీలు విరాళాలు సేకరించడం జరిగిందని 2017లో అధికారికరంగా అన్ని పార్టీలకు వర్తించే విధంగా తయారు చేసి బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్దమని సుప్రీం కోర్టు 15 ఫిబ్రవరి 2024న కొట్టి వేసిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, కల్లూరి మల్లేశం, దయ్యాల నర్సింహ, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, ఇక్బాల్, అశోక్, ఎల్లయ్య, షరీఫ్, లక్ష్మయ్య ఉన్నారు.

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాజయ్య

ఆలేరు రూరల్, మార్చి 11: అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడిగా చిరబోయిన రాజయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బేజాడి కుమార్, ఉపాధ్యక్షుడిగా బాబు, కోశాధికారిగా అంజయ్య, సహాయ కార్యదర్శిగా రాఘవరెడ్డి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

అడ్డగూడూరు, మార్చి 11: మండలంలోని జానకిపురం గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని మెపా రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న ముదిరాజ్, జిల్లా కో ఆపరేటివ్ సొసైటీ అధికారి ఎండి. జమీల్ అహ్మద్ అధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశబోయిన వెంకన్న, ఉపాధ్యక్షుడిగా యాట యాదగిరి, కార్యదర్శిగా గద్దగూటి రవి, డైరెక్టర్లుగా గద్దగూటి సంతోష్, యాట నాగరాజు, కేశబోయిన ప్రభాకర్, ఎల్లయ్య, రాములు ఎన్నికయ్యారు.

బీజేపీలో పలువురి చేరిక

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 11: యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బందారపు మల్లేశంతో పాటుగా సుమారు 30మంది యువకులు హైదరాబాద్‌లో బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. భువనగిరి ఎంపీ స్థానంలో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుట్ట బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, రచ్చ శ్రీనివాస్, కాదూరి అచ్చయ్య, భువనగిరి శ్యామ్, గుండ్లపల్లి మధు, కర్రె శ్యామ్‌కుమార్, మాటూరి నరేష్, భీమగాని వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గృహ ప్రవేశం చేసివారికి రూ.లక్ష



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్, మార్చి 11: ముందుగా గృహ ప్రవేశం చేసే లబ్ధిదారులకు రూ.లక్ష బహుమతిగా అందజేస్తామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని గొలనుకొండలో 179మంది లబ్ధిదారులకు సోమవారం నివేశ స్థలాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ది ప్రజల ప్రభుత్వమని, పేదల సంక్షేమం కోసం బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ప్రతిపక్షాల అవాస్తవాలను ప్రజలు నమ్మవద్దన్నారు. రైతులు, ప్రజలు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముందుగా గృహ ప్రవేశం చేసే లబ్ధిదారులకు రూ.లక్ష బహుమతిగా అందజేస్తామన్నారు. భక్తుల కొంగు బంగారం అయిన లక్ష్మీనరసింహ స్వామి అంద రిని గౌరవించే దైవమని బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని గొలనుకొండలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయిగిరి గుట్టకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు రావడం శుభపరిణామమన్నారు. లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని గంటన్నర పాటు కలియ దిరుగుతూ భక్తుల సమస్యలు అడిగి తెలుసుకున్న నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పాలకులు బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రాధాన్యం ఇవ్వకపోవడాన్ని ప్రజలు అనేక సందర్భాలలో నిలదీశారన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీ దాసి లక్ష్మీ, వైస్‌ఎంపీపీ గాజుల లావణ్య, హరిబాబు, వెంకటేష్, సురేష్, నీలం పద్మ ఉన్నారు.

భువనగిరిని ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దాం

భువనగిరి టౌన్, మార్చి 11: పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిలో బీజేపీని గెలిపించి మూడోసారి ప్రధాని కాబోతున్న ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. భువనగిరిలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మాత్రమే దేశం, సమాజం కోసం చిత్తశుద్ధిగా పనిచేస్తుందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర పోలింగ్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప యాత్రకు కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా వస్తున్నారని తెలిపారు. జిల్లాలోని బూత్‌ల అధ్యక్షులందరూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు రత్నపురం బలరాం, జెన్నపల్లి శ్యాసుందర్‌రెడ్డి, పట్నం కపిల్, ఉమాశంకర్రావు, ఉదయగిరి విజయకుమార్, జనగాం కవిత, పల్ల శివశంకర్, నీలం రమేష్, సంతోష్, కృష్ణచారి పాల్గొన్నారు.

అడ్డగూడూరు: భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ననుబోతు సైదులు కోరారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో తుంగతుర్తి కో కన్వీనర్ కూరాకుల వెంకటేశ్వర్లు, బాల్నే పెద్ద బిక్షం, శంకర్‌రెడ్డి, మద్ది నరేందర్, కుమారస్వామి, అరుణ, తోట అలివేలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి : ఎమ్మెల్యే కుంభం



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, మార్చి 11: భువనగిరి పట్టణంలోని పెండింగ్ పనులను వెంటనే పూర్తిచేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్థాంతరంగా నిలిచిన స్థానిక అర్బన్ కాలనీలోని హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను, సింగన్నగూడెం చౌరస్తాలో అంబేడ్కర్ భవన్ పనులను సోమవారం పరిశీలించారు. పనులు ఆగిపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ పి రామాం జుల్‌రెడ్డి, మాజీ చైర్మన్లు బర్రె జహంగీర్, దొనకొండ వనిత, కౌన్సిలర్లు ఈరపాక నర్సింహ, పడిగెల రేణుక ఉన్నారు. పట్టణంలో హుస్సేనాబాద్‌లో జరుగుతున్న మల్లన్న పండుగలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సంస్కృతి సంప్రదాయాలను వారసత్వ సంపదగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సత్యనారాయణ, మహేష్, శ్రీశైలం, హరినాథ్, కృష్ణయాదవ్, తుమ్మేటి పాండు, శ్రీశైలం పాల్గొన్నారు.

మోత్కూరు మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే సామేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మార్చి11: మోత్కూరు మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన మునిసిపల్ బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోత్కూరు మెయిన్ రోడ్డు పనులు, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పనులు, విద్యుత్ స్తంభాల మార్పు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎస్‌బీఐ నుంచి పాత బస్టాండ్ వరకు మెయిన్‌రోడ్డు ఎత్తులేపి, సీసీ చేయాలన్నారు. అంతకుముందు మునిసిపాలిటీకి రూ.19.84కోట్ల ఆదాయ, వ్యయాలతో మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ 2024-25 బడ్జెట్ ప్రవేశపెట్టగా కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. పన్నుల ద్వారా రూ.1.10కోట్లు, టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.80 లక్షలు, ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ.86లక్షలు, ప్రణాళికేతర నిధులు రూ.2.07కోట్లు, ప్రణాళిక నిధులు రూ.65లక్షలు, ఇతర వనరుల ద్వారా రూ.14.35 కోట్ల ఆదాయం వస్తుందని, సిబ్బంది వేతనాలకు రూ.1.47కోట్లు, పారిశుధ్య నిర్వహణకు రూ.53లక్షలు, గ్రీనరీకి రూ.31లక్షలు, నీటి సరఫరాకు రూ.31 లక్షలు, పరిపాలన ఖర్చు 36లక్షలు, ప్రణాళికేతరాలకు రూ.2.07కోట్లు, ప్రణాళిక నిధులకు రూ.65లక్షలు, ఇతర ఖర్చులకు14.15కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారు. సమావేశంలో చైర్‌పర్సన్ గుర్రం కవిత లక్ష్మీనర్సింహారెడ్డి, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య ఉన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి



చౌటుప్పల్‌లో ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

చౌటుప్పల్ టౌన్, మార్చి 11: ఎండిపోతున్న వరి పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలోని చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. వరి పంటను రక్షించుకునేందుకు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చీరిక సంజీవరెడ్డి, బూరుగు కృష్ణారెడ్డి, పాషా, గంగదేవి సైదులు, చీరిక అలివేలు, రాఘవరెడ్డి, సప్పిడి లక్ష్మారెడ్డి, ఆకుల ధర్మయ్య, కొండే శ్రీశైలం పాల్గొన్నారు.

వలిగొండ: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వ హించారు. నష్టపోయిన వరి పంటకు ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు సురేందర్, శ్రీశైలంరెడ్డి, రాంచందర్, భూపాల్, సత్తిరెడ్డి, ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, కిష్టయ్య, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : పంటలు ఎండి తీవ్ర నష్టపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, నూకల భాస్కర్‌రెడ్డి, జోగు శ్రీనివాస్, బండ్రెడ్డి ఈశ్వర్‌రెడ్డి, పి.ఎస్. లింగం, నూకల అరుణ, దుడుక నాగమణి పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: ఏడాది క్రితం ఆందోళన విరమణ కోసం కేంద్రం రైతులకు లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీఎస్పీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య అన్నారు. సోమవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై 425 రైతు సంఘాల ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు కాయగూర రామకృష్ణ, రాపోలు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మోత్కూరు: బావులు, బోర్లలో నీటి మట్టాలు తగ్గి ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మండలంలోని పాలడుగు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ఎండిన వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల కమిటి సభ్యులు దడిపెల్లి ప్రభాకర్, కొంపెల్లి ముత్తమ్మ, చింతకింది సోమరాజు, వడ్డెపల్లి లక్ష్మణ్, కొంపెల్లి గంగయ్య, రైతులు దడిపల్లి నవనీత, సైదులు పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించి ఎండుతున్న వరి పంటలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ డిమాండ్‌చేశారు. మండలంలోని హన్మపురంలో ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో రైతులు సాగు చేసుకుంటున్న చేతికొచ్చిన పొట్టదశకు చేరిన పంటలు ఎండిపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.

ఘనంగా బసవలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 11: మండలంలోని దంతూరు గ్రామానికి చెందిన బసవలింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ పాక వెంకటేశంయాదవ్,ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, ఆలయ చైర్మన్ మన్నె వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచు దోటి కుమార్ యాదవ్, బోదాసు శ్రీను, గంగదారి మురళికృష్ణ, ఈదయ్య పాల్గొన్నారు.

శాస్త్రాల సమ్మేళితమే పంచాంగం : మంత్రి

సంస్థాన్‌నారాయణపురం, మార్చి 11: ఖగోళ, గణాంక, తదితర శాస్త్రాల సమ్మిళితమే పంచాంగం అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని జనగాం గ్రామానికి చెందిన సిద్ధాంతి కొండోజు లక్ష్మీనర్సింహాచార్యులు రచించిన శ్రీక్రోధి నామ పంచాంగ పుస్తకాన్ని మంత్రి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిద్ధాంతిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో కంచకట్ల సంపత్, వెంకటాచారి, మారోజు భాస్కర్, కొండోజు ముకేష్, అనంత్‌శర్మ, శంకర్‌శాస్త్రి, వెంకటేశ్వర్లు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ఈవోను సస్పెండ్ చేయాలి

భువనగిరి టౌన్ / ఆత్మకూర్(ఎం) / మోటకొండూరు / మార్చి 11 : యాదగిరిగుట్ట దేవస్థానంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తక్కువ ఎత్తులో కూర్చోబెట్టి అవమానించిన దేవస్థానం ఈవోను సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుడు అయినందుకే ఉపముఖ్యమంత్రిని అలా కూర్చోబెట్టారని పేర్కొన్నారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే సహించమన్నారు. ఆత్మకూర్(ఎం)లో ఎమ్మార్పీఎస్ నాయకుడు కే రమేష్ మాట్లాడుతూ రెడ్డి వర్గానికి చెందిన మంత్రులు, ఉపముఖ్యమంత్రి విక్రమార్కను అగౌరపర్చారని ఆరోపించారు. భట్టి విక్రమార్కకు సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొంపెల్లి వెంకటేశం, బీ శ్రీను, కే రామచంద్రయ్య, ఎల్లయ్య, నవీన్, ఎం శ్రీను, చంద్రయ్య, ఆగయ్య, నరసయ్య పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే డిప్యూటీ బహుజనులకు క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ మోటకొండూరు మండల కన్వీనర్ ఆడెపు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలయ ఈవోను సస్పెండ్ చేయాలన్నారు.

నాంచారమ్మ జాతరను అధికారికంగా నిర్వహించాలి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 11 : మండలంలోని పిలాయిపల్లిలో వెలిసిన ఎరుకల నాంచారమ్మదేవి జాతరను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఎరుకల సంఘం(కుర్రు) రాష్ట్ర ప్రధానకార్యదర్శి లోకినీ రాజు కోరారు. హైదరాబాద్‌లోని ట్రైబల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఎరుకల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఎరుకల నాంచారమ్మదేవి జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కుర్రు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, రుద్రాక్ష నరసింహ, మందలాపురం గోపాల్, వనం రమేష్, రాయపురం వెంకటేశ్వర్లు, కుతాడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

మోత్కూరు, మార్చి 11: మోత్కూరులో దొంగల బెడద రోజురోజుకు పెరుగుతోంది. రెండు రోజుల కిందట పట్టపగలు తాళం వేసిన ఇంట్లో దొంగతనానికి పాల్పడటం, రాత్రి వేళ 8 బండిళ్ల విద్యుత్ మోటార్ల సర్వీస్ వైర్ దొంగిలించిన సంఘటనలు మరువకముందే ఆదివారం పగలు ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన సంఘటన వెలుగుచూసింది. మునిసిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపాన పూల వ్యాపారి గంగారాం చంద్రయ్య(పూల చంద్రయ్య) భార్య యాదమ్మ ఆదివారం మధ్యాహ్నం పూల దుకాణంలోనే నిద్రించింది. గుర్తు తెలియని ముగ్గురు మహిళలు వచ్చి తనను లేపినట్టు అనిపించగా ఆమె నిద్రలేచింది. తాను ఏం కావాలని అడుగ్గా పూలు కావాలంటూ కొనకుండానే వెళ్లి పోయారంది. ఆ తర్వాత సాయంత్రం తాను ఇంటికి వెళ్లి చూసుకుంటే తన మెడలో ఉండాల్సిన రూ.2.50లక్షల విలువైన 4 తులాల బంగారు పుస్తెలతాడు కనుపించలేదని వాపోయింది. పగలు తన వద్దకు వచ్చిన మహిళలే పుస్తెల తాడు దొంగిలించారని ఆమె విలపించింది. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపింది.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

భువనగిరి టౌన్, మార్చి 11: పట్టణంలోని ఇందిరానగర్‌లో సోమవారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడైన ఆటో డ్రైవర్ ఇటుకల స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపు తెరిచి ఉంది. దీంతో ఇంటిలో రూ.40వేల విలువ చేసే బంగారు ఆభరణాలు, 25తులాల వెండి ఆభరణాలు, రూ.12వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి బలవన్మరణం

భువనగిరి రూరల్, మార్చి 11: గూడ్స్ రైలు కింద పడి గుర్తుతెలియని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయగిరి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జే కృష్ణారావు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.. భువనగిరి పట్టణ శివారులోని రాయగిరి(యాదాద్రి) రైల్వేస్టేషన్ సమీపంలో కిలోమీటర్ నెంబర్ 246/4-6 దిగువ లైన్‌వే ట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధుడు(60) నడుస్తున్న గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు చేసుకున్నాడు. అతడు తెలుపు రంగు షర్ట్, ఆకుపచ్చ గోల్డ్ కలర్ గోధుమ రంగు శాలువ, రుద్రాక్ష మాల ధరించి ఉన్నాడు. వృద్ధుడు హిందువుగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్లు 8712568454 సంప్రదించాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా దుర్గయ్య



రామన్నపేట, మార్చి 11: బీజేపీ మండల అధ్యక్షుడిగా తుమ్మలగూడెం గ్రామానికి చెందిన పల్లపు దుర్గయ్యను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక ప్రతం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు దుర్గయ్య కృతజ్ఞతలు తెలిపారు.